


వైద్యకళాశాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం స్థానిక మండల పరిధిలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మంత్రి పినిపే విశ్వరూప్ సంబంధిత గుత్తే దారులకు సూచించారు బుధవారం ఆయన కామనగరువులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కామనగరువు లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పురోగతిని నిర్మాణ సంస్థ గుత్తే దారులను, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ ఇంజనీర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు ఆవిరి

- భారీ ప్రాజెక్టుల ఊసెత్తని నిర్మల
- పిఠాపురం-కాకినాడ మెయిన్ లైన్ విస్మరణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర బడ్జెట్లో ఈసారి కూడా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అన్యాయమే జరిగింది. కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న జిల్లా ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. ప్రాధాన్యత రంగాల అభివృద్ధికి సహకరించే విధంగా బడ్జెట్లో తగిన నిధులు కేటాయించలేదు. పోలవరం ఏడమ కాలువ, నిర్వాసితుల సమస్యలపై కనీస ప్రస్తావన లేదు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌కు నిధుల కేటాయింపు ఈబడ్జెట్లో ఓటు దక్కలేదు. పిఠాపురం-కాకినాడ మెయిన్‌లైన్ హామీను మరోసారి గాల్లో కలిపేశారు. ప్రతిష్టాత్మక భారతీయ విదేశీ వాణిజ్య సంస్థ (ఐఐఎఫ్‌టి)కు నిధుల కేటాయింపు మరిచారు. కనీసం ఎపి ప్రస్తావన లేకపోవడంతో కేంద్రంలో బిజెపి విమర్శ నాస్త్రాలు సంధిస్తున్నారు. జిల్లా అభివృద్ధికి అనేక ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పట్టాలెక్కాల్సిన రైల్వే ప్రాజెక్టులతోపాటు, గోదావరి జిల్లాల దశ, దిశను మార్చగల ప్రాజెక్టులు అనేకం కేంద్ర ప్రభుత్వం ముంగిట ఉన్నాయి. కాకినాడ ప్రాంతం మరో ముంబాయి మహా నగరంగా మారనుందని ఎన్నో ఆశలను కల్పించి అందుకు తగిన రీతిలో ఈసారి కూడా బడ్జెట్లో ప్రాధాన్యత రంగాలకు కేంద్ర మంత్రి ప్రకటించిన బడ్జెట్ స్పష్టం చేస్తోంది. పెట్రో కారిడార్, భారతమాల ప్రాజెక్టులో భాగంగా ఆరు లైన్ల రోడ్డు, రిఫైనరీ, కేప్టివ్ పోర్టు, బెర్తింగ్స్ ఇలా ఎన్నో ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం ముందు ఉన్నా అవేమీ పట్టించుకోలేదు.

పోలవరాన్ని పట్టించుకోలేదు

71.33 శాతం పనులు పూర్తయిన పోలవరాన్ని ఈసారి బడ్జెట్లో కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలో తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన ఏడమ కాలువ పనులు ముందుకు సాగడం లేదు. నిధుల లేమి, మరోవైపు నిర్వాసితులకు పరిహారం అందించడానికి నిధులు కేటాయింపులో ఈసారి మొండి చేయి చూపారు. మరో రూ.1,385 కోట్లు అవసరం కాగా కేటాయింపులు మరిచారు.

చిరకాల వాంఛకు మళ్లీ నిరాశ

చిరకాలమైన కోటిపల్లి -నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోనసీమ జిల్లా ప్రజల చిరకాల వాంఛ. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించ చడం లేదు. కేంద్రం అరకొర నిధులనే ఇస్తూ ఈసారి బడ్జెట్లో అవి కూడా ప్రస్తావన లేదు.

పారిశ్రామిక ప్రగతి ఊసేమేది..?

కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తూ వస్తోంది. కాకినాడ, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో సుమారు 14వేల ఎకరాలు ఈ పరిశ్రమలకు కేటాయించాలని భావించారు. కేంద్రం నిధులు బడ్జెట్లో ప్రస్తావనకు రాకపోవడంతో నిరాశ మిగిలింది.

పిఠాపురం మెయిన్ లైన్ హామీ ఏది?

దశాబ్దాల కాలం నుంచి ఆశలు పెట్టుకున్న పిఠాపురం మెయిన్ లైన్ ప్రస్తావన ఈ బడ్జెట్లోనూ లేకుండా పోయింది. రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆశలు ఎప్పటికి నెరవేరుతాయని బిజెపీ ప్రభుత్వాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. యాంకరేజీ పోర్టు విస్తరణకు సంబంధించిన న్యాయమైన రీతిలో నిధుల కేటాయింపు జరగలేదు. దక్షిణ మధ్యరైల్వేలోనే కీలకమైన ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్న కాకినాడ పోర్టు స్టేషన్ గూడ్స్ పరంగా అభివృద్ధిపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు అంశం ఈ బడ్జెట్ లో ప్రస్తావన లేదు. రాజమహేంద్రవరం వద్ద ఆర్వి బ్రిడ్జిపై రెండో ట్రాక్ నిర్మాణానికి ప్రతిపాదనలువెళ్లాయి. దక్షిణ మధ్య రైల్వే జిఎం మూడేళ్ల క్రితం రాజమహేంద్ర వరం పర్యటన సందర్భంగా ఆర్వి బ్రిడ్జిపై రెండో ట్రాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం ముందు ఉన్నాయని ప్రకటించారు. కానీ ఈ బడ్జెట్లో కూడా నిధుల కేటాయింపు కన్పించలేదు.

దేశ సంపదను దోచిపెట్టే బడ్జెట్

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సంపదను పెట్టుబడిదారులకు దారాదత్తం చేసేదిగా ఉంది. గత బడ్జెట్లో మాదిరిగానే ఈసారి కూడా ప్రభుత్వ సంస్థల వాటాను సుమారు రూ.60 వేల కోట్లు పెట్టుబడిదారులకు అమ్మకానికి పెట్టింది. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాల్సి ఉండగా మరింత కోత విధించింది. స్త్రీ, శిశు సంక్షేమాన్ని విస్మరించింది. విద్య, వైద్య రంగాలకు ఏమాత్రం నిధులు కేటాయించలేదు.

- ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎంఎల్సి

కోనసీమ రైల్వే లైన్ కు మొండి చేయి

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కోనసీమ వాసుల చిరకాల వాంఛ అయిన కోటిపల్లి రైల్వే లైన్ పనులకు నిధులు కేటాయించకపోవడం చాలా అన్యాయం. వ్యవసాయాన్ని తిరుగమనంలో నడిపించే విధంగా రూపొందించారు. కోనసీమలో సహజ వనరుల నిక్షేపాలను ఉపయోగించుకుని అభివృద్ధి చేయడం కోసం, తద్వారా ఉపాధి అవకాశాలను కల్పించడానికి శ్రద్ధ చూపలేదు.

- కె.వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్, అంబేద్కర్ కోనసీమ

రాష్ట్రానికి, జిల్లాకు తీవ్ర అన్యాయం

కేంద్ర బడ్జెట్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసింది. ఉపాధి హామీ నిధుల్లో భారీగా కోత విధించారు. ఎరువులపై సబ్సిడీ తగ్గించి, ధరలు పెంచారు. కుల గణన చేపట్టకుండా బిసి సబ్ ప్లాన్, ఎస్సి సబ్ ప్లాన్ నిధులు కేటాయింపులు లేవు. 25 శాతం ఎస్సి, ఎస్టిలకు 6 శాతం కేటాయింపులు చూస్తే దళితులపై ప్రేమ అర్థం అవుతుంది. విభజన హామీల అమలు, రాష్ట్రాభివృద్ధి పోలవరం నిర్వాసితుల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఊసు లేదు. రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్టని బిజెపి విధానాలను అధికార ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాలి.

- ఎం.రాజశేఖర్, సిపిఎం జిల్లా కన్వీనర్, కాకినాడ

కొనసాగుతున్న బిజెపి విద్రోహం

కేంద్రం ఎప్పటి మాదిరిగానే బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రజల హక్కు అయిన ప్రత్యేక హోదాకు మొండిచెయ్యి చూపింది. విభజన హామీలను పూర్తిగా అటకెక్కించింది. కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసింది. నిర్వాసితులకు మొండిచేయి చూపింది. రాజధాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. తీవ్ర నిరాశ కలిగించిన కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించాలని కోరుతున్నాం.

- టి.అరుణ్, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి



కాకినాడలో సమరయాత్ర సభలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

సమరశంఖం పూరించాలి

ప్రత్యేక హోదా కోసం యువజన, విద్యార్థి సంఘాల యాత్రలో వక్తలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో యువత భవిష్యత్తు ప్రత్యేక హోదాపై ఆధార పడి ఉందని, ఆంధ్రరాష్ట్రాన్ని చిన్న చూపు చూస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు యువత సమరశంఖం పూరించాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన సంఘాలు ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన సమర యాత్ర బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించింది. ఉదయం రాజమహేంద్ర వరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కాలేజీలో బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం రోడ్డు మార్గాన కాకినాడ చేరుకున్నారు. ఇంద్రపాలెం నుంచి జెఎన్‌టియు వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జెఎన్‌టియు సెనెట్ హాల్లో సభ నిర్వహించారు. ఇంద్రపాలెం వద్ద యాత్రకు ఘన స్వాగతం లభించింది. పూలమాలలతో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక హోదా- ఆంధ్రులు హక్కు అనే నినాదాలు హోరెత్తాయి. తొలుత రాజమహేంద్ర వరంలో జరిగిన సభకు పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ అధ్యక్షత వహించారు. కాకినాడ జెఎన్‌టియులో నిర్వహించిన సభకు ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ నగర కార్యదర్శి ఎం.సూరిబాబు అధ్యక్షత వహించారు. ఈ బహిరంగ సభల్లో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. గడిచిన ఎనిమిదన్నరేళ్లలో విభజన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీల పేరుతో మభ్య పెడుతూ కాలం వెల్లదీశారని విమర్శించారు. అధికార వైసిపి ప్రతిపక్ష టిడిపి జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని విభజన హామీలు సాధన కోసం ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన జగన్ మాట తప్పి మోదీకి భయపడుతు న్నాడని అన్నారు. హోదా ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన జగన్ ఢిల్లీ వెళ్లి ప్రకట నలు ఇవ్వడం తప్ప చేసేదేమీ లేదన్నారు. రాష్ట్రంలో వామపక్షాలు మాత్రమే ప్రత్యేక హోదా కోసం ప్రజలపక్షాన నిలబడి పోరాడుతున్నాయన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఉమా మహేశ్వరరావు, మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం యువజన విద్యార్థి సంఘాల చేస్తున్న సమరయాత్రకు పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు.


రాజమహేంద్రవరం సభలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం 32 మంది ప్రాణాలర్పిస్తే పరిశ్రమ ఏర్పాటు అయిందని తెలిపారు. అదే విశాఖ ఉక్కును మోడీ ప్రియ మిత్రుడు అదానీకి కట్టబెట్టాలని చూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగం లేకపోతే భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు ఉండవని అన్నారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని బిజెపి నేతలు వాఖ్యానించటం శోచనీయం అన్నారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రాజకీయ అవసరాల కోసం రాష్ట్ర హక్కుల సాధనను విస్మరించి కాలక్షేపం చేస్తున్నాయన్నారు. అవకాశవాద రాజకీయ పార్టీలకు రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తొలుత ఎఫ్‌ఎస్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని మాట్లా డారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, అల్లూరి సీతారామరాజు మేనల్లుడు సత్తిరాజు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి, సిపిఎం నగర కార్యదర్శి బి. పవన్, సిపిఐ నగర కార్యదర్శి కొండల రావు, కోనసీమ జిల్లా కార్యదర్శి సత్తిబాబు, పిడిఎస్‌యు నగర కార్యదర్శి ధర్మేష్, నగర నాయకులు దినేష్, శివ, మురళి డివైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాము, ఎఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.భూషణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, ఎవైఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర, ఆప్ తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ అత్తిలి రాజు పాల్గొన్నారు.


ఆసుపత్రి సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

పిహెచ్‌సికి వితరణ

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పిహెచ్‌సికి గ్రామానికి చెందిన మట్టపర్తి పుల్లంశెట్టి మాస్టారు జ్ఞాపకార్థం ఆయన భార్య అన్నపూర్ణమ్మ, కుమారుడు ఉమా మహేశ్వరరావులు రోగుల ప్రయోజనార్థం వీల్ చైర్, ఫోల్డింగ్ బెడ్,12 బెడ్ షీట్ లను బహూకరించారు. వీటిని బుధవారం పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ ఎల్.నాగార్జునకు అన్నపూర్ణమ్మ, ఉమామహేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.విజయలక్ష్మి, స్టాఫ్ నర్స్ వి.జ్యోతి శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5న విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వాటిని సాధించే మార్గాలు అనే అంశంపై నిపుణులతో ప్రత్యేక అవగాహన సదస్సు ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత, పూర్వ విద్యార్థులకు కోసం ఈ సదస్సు కళాశాల్లో ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 6305698749, 7382929716 సంప్రదించాలన్నారు.

కార్టూ'నిజం'



కార్పొరేట్ సంస్థలకే కద్వార్..!!


ఐ.పోలవరంలో సంకల్పదీక్ష పోస్టర్లను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సంకల్పదీక్ష జయప్రదానికి పిలుపు


ప్రజాశక్తి-ఐ.పోలవరం

సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఈనెల 3న గన్నవరం సమీపంలో సుందరయ్య విద్యానగర్ లోని ధర్మస్థలిలో నిర్వహించనున్న సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ ఐ.పోలవరం మండల శాఖ అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గంటా సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. ఐ.పోలవరం జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్ నందు సంకల్ప దీక్ష కు సంబంధించిన పోస్టర్లను బుధవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత సిఎం జగన్ ఆనాడు ప్రతిపక్ష నేతగా తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వారం రోజుల్లో సిపిఎస్ ను రద్దు చేస్తామని చెప్పిన మాటలు మూడు సంవత్సరాలయిన గడిచినప్పటికీ నెరవేరలేదని అన్నారు. మొదటనుంచి పశ్చిమబెంగాల్ ఒపిఎస్ అమలు చేస్తూ ఉండగా ఇటీవల కాలంలో రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, ఝార్ఖండ్ రాష్ట్రాలు ఒపి ఎస్ ను అమలు చేయడానికి ఆయా అసెంబ్లీ తీర్మానాలు కూడా చేశాయని గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడిన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కూడా సిపిఎస్ ను రద్దుచేసి ఒపిఎస్ అమలు దశగా అడుగులు వేసిందని అన్నారు. ప్రధాన కార్యదర్శి సూర్యచంద్రరావు మాట్లాడుతూ సిపిఎస్ విధానం ఉద్యోగుల భద్రత కాలరాస్తోందని అన్నారు. సిపిఎస్ విధానం రద్దు చేయాలని పాత పెన్షన్ పునరుద్ధరించాలని గత ప్రభుత్వ హయాంలో స్వతంత్రంగాను ఉమ్మడి వేదికలు పైన అనేక పోరాటాలు చేశామని అన్నారు. సిపిఎస్ జిపిఎస్ ఏదైనా ఉద్యోగుల, ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వానికి లాభం ఉండబోదని గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. కార్పొరేట్లకు మాత్రమే లాభాను చేకూర్చే కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మండప నిర్మాణం అభినందనీయం

ప్రజాశక్తి-రాజోలు

రాజోలులో ప్రజల సౌకర్యార్థం వాసవీ ఆర్యవైశ్య సంఘ బలభద్ర రాయుడు కల్యాణ మండపాన్ని డపం నిర్మించడం అభినందనీయమనిం ఎంఎల్ఎ రాపాక వరప్రసాద రావు అన్నారు. రాజోలులో నిర్మంచిన కల్యాణ మండపాన్ని బుధవారం ఎంఎల్ఎ రాపాక వరప్రసాద రావు, కల్యాణ వేదికను లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్, ఫస్ట్ ఫ్లోర్ పారిశ్రామికవేత్త కంచర్ల శేఖర్, డైనింగ్ హాల్ ను ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, విశ్రాంతి గదులను వ్యాపార వేత్త కెఎస్ఎన్.రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. తొలుత వాసవీ మాత విగ్రహంతో రాజోలులో ఊరేగింపు జరిపారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ రాపాక మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేసిన కాసు శ్రీనివాస్, సంఘ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ సభ్యులు కెఎస్ఆర్ఎన్.మూర్తి, చలువాధి త్రినాథ్, కాసు భవాని, కొత్త పద్మావతి, కోదాటి దుర్గ, రాజా కుమార్, స్థానిక నాయకులు పామర్తి రమణ, నామన షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ వరప్రసాదరావు

పైప్ లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

సమనస జగనన్న కాలనీలో తాగు నీరు నిమిత్తం వాటర్ పైప్ లైన్ పనులను బుధవారం రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ళ రమేష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్పర్జన్ రాజు, ఎంపిటిసి సభ్యుడు ఉడుము రామకృష్ణ, వైసిపి నాయకుడు మామిళ్ళపల్లి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి అన్యాయం

సిపిఎం, ప్రజా సంఘాల ధర్నాల్లో నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్రం ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని, రాష్ట్ర ప్రజల హక్కు అయిన 'ప్రత్యేక హోదా'కు మొండిచేయి చూపిందని, విభజన హామీలను పూర్తిగా అటకెక్కించిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.హరిబాబు విమర్శించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెం టర్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్‌ను తక్షణం ఉపసం హరించు కోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాల్లో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని అదానీకి బిజెపి తాకట్టుపెట్టిందని, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటి ఊసెత్తలేదని ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ ఉక్కును బలపర్చు కోడానికి ఎలాంటి ప్రతిపాదనా చేయలేదని ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా వంటి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థల సంగతీ అలాగే ఉందని, ఉభయ తెలుగు రాష్ట్రాల గిరిజన విశ్వవిద్యాలయాలకు 2022-23 బడ్జెట్‌కన్నా 15 శాతం కోత విధించడం అమానుషమని, మొత్తం 62 పేజీల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఆంధ్రప్రదేశ్ అన్న మాటనే ఉచ్ఛరించ కపోవడం దారుణమని అన్నారు. ఉపాధి హామీకి గత ఏడాది కంటే రూ.25 వేల కోట్లు తక్కువ కేటాయించడం చాలా అన్యా యమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేం దుకే ఈ కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం లో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాలకు కేవలం 3.5 శాతం మాత్రమే బడ్జె ట్‌లో కేటాయించారని, 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్ జాతులకు కేవలం 2.7 శాతం మాత్రమే కేటాయించారని చెప్పారు. సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదన్నారు. ఈ ధర్నాల్లో సిపిఎం బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు జి.దుర్గాప్రసాద్, ఎం.బలరాం, కెవిపిఎస్ జిల్లాకార్యదర్శి పి.వసంత్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామ చంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు శ్రీరా మూర్తి, ఇసుకపట్ల మంగాదేవి, బీర వెంకట్రావు, బుంగ సత్యనారాయణ, కుడుపూడి రాఘవమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

ఏప్రిల్ 5న 'చలోఢిల్లీ' విజయవంతానికి పిలుపు

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక, కర్షక వ్యవసాయ కార్మిక విధానాలు నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ, నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామని చలో ఢిల్లీ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. అమలాపురం స్థానిక ఎంప్లాయీస్ హోమ్ నందు బుధవారం సిఐటియు రైతు కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లా డుతూ జిల్లాలో ఫిబ్రవరి 6న జిల్లా స్థాయి సదస్సులు, ఇంటింటికీ బిజెపి విధానాలను ఎండగడుతూ మీ మీ మండలాల్లోనూ గ్రామాల్లోనూ నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, ఎం.బలరాం, కెవిపిఎస్ జిల్లాకార్యదర్శి పి.వసంత్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామచంద్రరావు, శ్రీరామూర్తి, ఇసుక పట్ల మంగాదేవి, కోటుం బేబీ గంగా రత్నం, బీర వెంకట్రావు, బుంగ సత్యనారాయణ, కుడు పూడి రాఘవమ్మ, బి.ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువు అక్రమ తవ్వకం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని కందికప్పు శివారు అడివిపేట గ్రామంలో వరిచేలల్లో అక్రమంగా రొయ్యల చెరువు తవ్వుతున్నారు. సుమారు పది ఎకరాల పైబడి ఉండే విస్తీర్ణంలో చెరువు తవ్వకాలు కొనసాగిస్తుండముతో చుట్టుపక్కల గ్రామాలవారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఈ తవ్వకం పనులు మొదలు కావడంతో గ్రామస్తులు పనులు ఆపాలని కోరుతున్నారు. ప్రాథమిక పాఠశాలను అనుకుని సాగిస్తున్న ఈ చెరువు తవ్వకం వలన విద్యార్థులు అనారోగ్యం పాలై ఇబ్బందులు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ చెరువు త్రవ్వకం పనుల పై సంబంధిత శాఖ అధికారులు స్పందించి పనులు ఆపకపోతే జిల్లా స్థాయిలో ఉద్యమం చేపడుతామని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు. జగనన్న ఇళ్ల స్థలాలు కొరకు పొన్నాడ వారి గట్టు దగ్గర ప్రభుత్వం కొంత స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ స్థలాన్ని మెరక చేసేందుకు ఈ చెరువులోని మట్టిని తరలించి ప్రభుత్వ స్థలాలను పూడ్చే పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకే ఈ చెరువులోని మట్టిని తరలించి ప్రజలకు మేలు చేసేందుకే ఈ మట్టిని తరలించి పనులు చేపడుతున్నామని రాజకీయ నాయకులు గ్రామస్తులకు సర్ది చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఈ చెరువు తవ్వకం పనులు మొద లుపెట్టగా గ్రామస్తులందరూ అభ్యంతరం చెప్ప డంతో పనులు నిలిపేసిన నిర్వాహకులు నేడు జగ నన్న ఇండ్ల స్థలాలు మెరక చేసే ఉద్దేశంతో గ్రామ స్తులకు సర్ది చెప్పి అక్రమంగా రొయ్యల చెరువు తవ్వకాల పనులు చేప ట్టడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అధికారులు స్పందించి అక్రమంగా తవ్వుతున్న చెరువు తవ్వ కం పనులను నిలిపివేయాలని లేకపోతే తమ పోరా టాలను ఉధృతంచేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.


అడివిపేటలో అక్రమంగా తవ్వుతున్న రొయ్యలచెరువు


చిత్రపటం అందుకుంటున్న డివిఎస్ దంపతులు

బాలబాలాజీ ఆలయానికి రూ. 2.15 లక్షల ఆదాయం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి బుధవారం రూ.2,15,410 ఆదాయం సమకూరిందని ఇఒ ఎమ్‌కెటి.నాగ వర ప్రసాద్ తెలిపారు. స్వామి వారిని 3,851మంది భక్తులు దర్శనం చేసుకోగా, 3,092మందికి అన్న ప్రసాదం అందించామన్నారు. శాశ్వత అన్నదాన ట్రస్ట్ కు ఫ్రెంచి యానాం వాసులు అన్యం సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి సతీమణి రత్నమాల, కుటుంబ సభ్యులు వీ రభద్రరావు పార్వతి, శ్రీనివాస్ మహాలక్ష్మి, రమణమూర్తి, సత్యవేణి దంపతులు రూ.25వేల విరాళం, దీప్తి విద్యాసంస్థల అధిపతి ధూళిపుడి వీర వెంకట సత్యనారాయణ(డివిఎస్), భ్రమరాంబ దంపతులు రూ.10 వేలు విరాళాన్ని నిత్యాన్న ట్రస్ట్‌కు అందజేశారని ఇఒ తెలిపారు. ధూళిపుడి వీర వెంకట సత్యనారాయణ(డివిఎస్), భ్రమరాంబ దంపతుల పెళ్లి రోజు డిసెంబర్2న అన్న దానం జరిపించే నిమిత్తం విరాళం ఇచ్చారని ఇఒ తెలిపారు. దాతలకు ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వేణు

భీమేశ్వరస్వామి నగరోత్సవం

ప్రజాశక్తి -రామచంద్రపురం


ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్య క్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కష్ణ పాల్గొని నంది వాహనం పై స్వామి వారి నగరోత్సవాన్ని ప్రారంభించారు. అంతకు ముందు స్వామి వారికి మహా రుద్రాభిషేకం చేశారు. కార్య క్రమం లో ఆలయ ఇఒ పి.తారకేశ్వరరావు, ఆలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

నా జీవితంలో గొప్ప అనుభవం

ప్రధాని మోదీతో పరీక్షా పే చర్చలో పాల్గొన్న వేట్లపాలెం విద్యార్థి ఇస్సాకు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్రమోదీని కలవడం నా జీవితంలో గొప్ప అనుభవం అని సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి తగరంపూడి ఇస్సాకు చెప్పాడు. జనవరి చివరి వారంలో న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ జరిపిన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న తగరంపూడి ఇస్సాకును వేట్లపాలెం శ్రీ రామకృష్ణ ధాన్యమందిరం నిర్వాహకులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఇస్సాకు రామకృష్ణ ట్యూటోరియల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనుటకు ప్రతీ విద్యార్థి సమయపాలన, క్రమశిక్షణ సాధనం చేయడం ద్వారా మాత్రమే విజయం సాధించవచ్చునని ప్రధాని చెప్పిన విషయాలు నాకు స్ఫూర్తిని ఇచ్చినట్లు చెప్పారు. నేను జీవితంలో నా తండ్రిని ఆదర్శంగా తీసుకుంటున్నట్లు చెప్పారు. తన తండ్రి తగరంపూడి సత్యనారాయణ హుస్సేన్‌పురంలో శ్రీ వెంకట్రామా ఆయిల్స్ కంపెనీలో చిరుద్యోగిగా పనిచేస్తుండగా, తాను కరపలోని మహాత్మా జ్యోతిభా పూలే ఎపీ వెనుకబడిన తరగతుల పాఠశాలలో 10 వతరగతి చదువుతున్నట్లు చెప్పాడు. తన తల్లిదండ్రులు, గురువులు, న్యూఢిల్లీలో అన్ని రకాలుగా సహకరించిన ఎస్‌సిఈఆర్‌టీ స్టేట్ ఆఫీసరు సోమశేఖర్‌కు కృతజ్ఞతలు చెప్పాడు. పరిక్షా పే చర్చలో ప్రధాని మోదీ ఇచ్చిన సూచనలు సలహాలు తనకు ఎంతగానో ఉపకరించనున్నట్లు చెప్పాడు. ఈ సందర్భంగా రామకృష్ణ ధాన్యమందిరం నిర్వాహకులు ఆదర్శ విద్యార్థి ఇస్సాకు సేవలను కొనియాడుతూ దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఇస్సాకు తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీతో పరీక్షా పే చర్చలో పాల్గొన్న ఇస్సాకు (ఫైల్)

ఎంఎల్‌ఎ కోటంరెడ్డి ఆరోపణలపై అధికారుల జవాబు ఏంటో!

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అధికార పార్టీకి చెందిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్, అభివృద్ధికి సహకరించని ఆరోపణలపై అధికారులు సమాధానం ఏమి చెప్తారో చూడాలని పెద్దాపురం ఎంఎల్‌ఎ టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం సాయంత్రం సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వైసిపి ఎంఎల్‌ఎలు తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగట్లేదని, గ్రామాలకి నిధులు ఇవ్వట్లేదంటున్నారన్నారు. అలాగే గడపగడపకి వెళుతుంటే ప్రజలు రోడ్లు, డ్రెయిన్లు కూడా నిర్మించటం లేదని స్థానిక ఎంఎల్‌ఎలను నిలదీస్తున్నారన్నారు. ఈ రోజు నెల్లూరు జిల్లాలో వైసిపి ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన ఫోన్‌ను టాపింగ్ చేశారని ఆధారాలతో నిరూపించారని, అలాగే తన నియోజకవర్గానికి అభివృద్ధికి ఎటువంటి విధంగా ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాలలో సహకరించలేదని, ప్రభుత్వం తనని ఫోన్ ట్రాపింగ్ ద్వారా మానసికంగా ఒత్తిడికి గురి చేశారని చెప్పడం, దీనిపై ప్రభుత్వం అధికారులు ఏ రకంగా సమాధానం చెప్తారో చూడాలన్నారు. కొంతమంది ఐపీఎస్, ఐఎఎస్‌ల ఫోన్ కూడా టాపింగ్ అవుతున్నాయని, టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌ల ఫోన్‌లు కూడా ట్యాపింగ్ చేస్తున్నారని గతంలో మేము ఫిర్యాదు చేయడం కూడా చేశామన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులు, జరుగుతున్న పరిస్థితులు గమనించాలని రాజప్ప తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప



యానాం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు


అంబేద్కర్ సంక్షేమ సంఘం నిరసన ప్రదర్శన

- స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - యానాం

స్థానిక సమస్యలపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పనుగుమట్ల విష్ణుమూర్తి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద నుండి చిన్న సెంటర్ మీదుగా ర్యాలీగా ఆర్ఎఒ కార్యాలయం చేరుకుని అక్కడ ధర్నా నిర్వ హించి యానం ఆర్ఎఒకు వినతిపత్రం పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పునుగుమ్మట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ పాండిచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా దళిత సమస్యలపై నిరసన జరుగుతోందని అందులో భాగం గానే యానాం దళిత సమస్యలపై నిరసన చేపట్టామన్నారు. యానాం ఎస్‌సి గ్రామాల్లో డ్రెయిన్‌ల నిర్మించాలని, స్మశాన వాటికలు చాలా అధ్వానంగా ఉన్నాయని మండిపడ్డారు. దొమ్మేటివారిపేట డ్రెయిన్ సమస్య చాలా తీవ్రంగా ఉందని, కాలుష్యం వల్ల ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు అనారోగ్యాలు గురవుతున్నారని ప్రభుత్వాలు పట్టించుకుని సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గా ప్రసాద్, యానం సిఐటియు నాయకులు కుంచే సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారం చేయాలని, లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ రెవెన్యూ అడ్మినిస్ట్రేటివ్ నామాడి అప్పారావు, రిటైర్డ్ ఉద్యోగి రాజేంద్రప్రసాద్, దొమ్మేటి పేట గ్రామ పెద్ద మట్టా శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



7వ డివిజనల్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఎన్నికల హామీల అమలే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎన్నికలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి అన్నారు. బుధవారం ఆయన 7వ డివిజన్‌లో రేచర్ల పేట తలుపులమ్మ తల్లి ఆలయం నుంచి గడపగడపకు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళపాలనలో ప్రభుత్వం అమలుచేసిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడ చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్, వైయస్సార్సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, కమిషనర్ కె.రమేష్, ఎడిసి సిహెచ్ నాగ నరసింహారావు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, టిపిఆర్‌ఓ మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు వీరి వెంట ఉన్నారు.



దుర్గా ప్రసాద్‌ను సత్కరిస్తున్న శ్రీశారదా విద్యాలయం కరస్పాండెంట్ వర్మ

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి దుర్గా ప్రసాద్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్‌లో ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. గత నెల 26న బెంగళూరు లో జరిగిన భారత్ క్లాసిక్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 85 కేజీల మెన్ ఫిజిక్ విభాగంలో గొల్లపల్లి దుర్గాప్రసాద్ ప్రథమ స్థానం, క్లాసిక్ ఫిజిక్ విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా అన్నవరం వాసి గొల్లపల్లి దుర్గాప్రసాద్‌ను అన్నవరం శ్రీ శారదా విద్యాలయంలో ఘనంగా సత్కరించారు. .కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ కృష్ణ వర్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉపాధ్యాయ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



బాలలకు అన్నప్రాసన చేస్తున్న చైర్‌పర్సన్ తులసి మంగతాయారు

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు, బాలలకు, బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అన్నారు. బుధవారం స్థానిక వరహాలయ్యపేటలోని అంగన్వాడీ కేంద్రంలో బాలలకు నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని బాలలకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త జాగారపు సూర్యకుమారి ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో రాయిపల్లి ధనదర్శిక, వరలక్ష్మి, జి నూకరత్నం, పి.మహతి, విజ్జి, అపర్ణ, దేవాడ రేవతీదేవి, బొడ్డు రమ్య, ఎం విజయ, బి జ్యోతి, మహిళా పోలీసు జె.పావని తదితరులు పాల్గొన్నారు.

వర్శిటీని ముందంజలో నిలిపేందుకు కృషి

- జెఎన్‌టియుకె విసి ప్రసాద్ రాజు

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ నూతన విద్యా విధానాన్ని అనుసరిస్తూ వినూత్న సంస్కరణలతో జెఎన్‌టియుకెని ప్రగతిపథంలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఉపకులపతి జివిఆర్. ప్రసాదరాజు తెలిపారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో మంగళవారం, బుధవారాలు రెండు రోజులపాటు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు), ఆంధ్రా యూనివర్శిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐయు సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ మీట్ 2022-23 నిర్వహించారు. సమావేశంలో భాగంగా రీసెర్చ్, ఎక్స్‌టెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్ మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనే అంశంపై సమీక్ష నిర్వహించారు. రెండవ రోజు బుధవారం జరిగిన టెక్నికల్ సెషన్‌కు ఏఐయు ప్రెసిడెంట్, జోద్‌పూర్ యూనివర్శిటీ ఉపకులపతి సురంజన్ దాస్ అధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. గౌరవ అతిథులుగా ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, ఏపిఎస్‌సిహెచ్ వైస్ ఛైర్మన్ కె.రామ్మోహనరావు హాజరయ్యారు. ఎస్ఇ ఆర్‌బి కార్యదర్శి, డిఎస్‌టి సీనియర్ అడ్వయిజర్ అఖిలేష్ గుప్తా, బెంగుళూరు జైన్ యూనివర్శిటీ ఉపకులపతి రాజ్‌సింగ్, ఐసిఎస్ఎస్ఆర్ మాజీ మెంబర్ సెక్రటరీ వి.కె.మల్హోత్రాలు వర్చువల్ విధానంలోను, జెఎన్‌టియుకె ఉపకులపతి, జెఎన్‌టియు జివి, ఆదికవి నన్నయ యూనివర్శిటీల ఇన్‌చార్జ్ ఉపకులపతి జివిఆర్.ప్రసాదరాజు వక్తలుగా వ్యవహరించారు.

టెక్నికల్ సెషన్లో భాగంగా జెఎన్‌టియుకె వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు సాంకేతికపరంగా అభివృద్ధి పథంలో ముందంజలో ఉండా లంటే రీసెర్చ్ ఫండింగ్, ఇంటర్నేషనల్ గ్రాంట్స్ ఎంతో అవసరమన్నారు. జెన్‌టియుకె ప్రధానంగా పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగానే డిఎస్‌టి, సెర్చ్ తదితర సంస్థల ద్వారా అనేక ఫండింగ్ ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఇంటర్నేషనల్ గ్రాంట్స్‌లో భాగంగా జెఎన్‌యుకె ఒబామా సింగ్ పార్టనర్షిప్-2020 గ్రాంటు పొందామన్నారు. అదేవిధంగా రీసెర్చ్ అసోసియేట్‌ను స్పాన్సర్ చేయడానికి విప్రో సంస్థ అంగీకరించిందని, పార్టనర్షిప్-2020 ప్రాజెక్టు ఎంహెచ్ఐఆర్‌డి బృందం ప్రత్యేకంగా ప్రశంసించి విద్యార్థులకు పెయిడ్ ప్రాజెక్టు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. జెఎన్‌టియుకె కాకినాడ, ఆదికవి నన్నయ యూనివర్శిటీ, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ, ఎన్ఐటి ఏపిలతో కూడిన గోదావరి విశ్వవిద్యాలయాల ప్రాంతీయ క్లస్టర్ గ్రూప్‌గా ఏర్పడి పరిశోధన, కన్సల్టెన్సీ, శిక్షణా కార్యక్రమాలు, విస్తరణ కార్యకలాపాలపై సహకారం అందిపుచ్చు కోనున్నట్టు తెలిపారు. మంగళవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ బిశ్వభూషణ్ హరిచందన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉపాధి కల్పన, నైపుణ్య భారత్ నిర్మాణంలో ఉపకులపతులు ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఏయు ఉపకులపతి పివిజిడి. ప్రసాదరెడ్డి, ఏఐయు జనరల్ సెక్రటరీ డాక్టర్ పంకజ్ మిట్టల్, యుజిసి, ఏఐసిటిఈ, న్యాక్, ఎన్‌బిఎ అధికారులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన వివిధ యూనివర్శిటీల వీసీలతో ప్రసాదరాజు

ఆదిత్య గ్లోబల్ స్కూల్ ఆదిత్-2023 పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో బుధవారం ఆదిత్ పోస్టర్(గోడ పత్రిక)ను డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి విడుదల చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణ రెడ్డి మాట్లాడుతూ ఆదిత్ పేరిట ఫిబ్రవరి 3, 4 శుక్ర, శనివారా లలో రెండురోజుల మేనేజ్మెంట్ స్కిల్స్‌పై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా అజిత్ కుమార్., (వి.డి.ఎం., వ్యవస్థాపక అధ్యక్షులు). టి.నీరజ్ కుమార్ (రాక్ సెరామిక్స్ కంపెనీ హెడ్. (హెచ్.ఆర్) పాల్గొంటారని తెలిపారు. దేశం నలుమూలల నుండి పాల్గొనే బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులు తమ కళాశాల నుండి నేరుగా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల ద్వారా వివిధ రకాల అంశాలలో పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులతో వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. వీటిలో మార్కెటింగ్, ఫైనాన్స్, మానవవనరులు, ఐ.టి రంగాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాకరంగా నిర్వహించే ఈ జాతీయ స్థాయి ఈవెంట్‌కు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం ఏర్పాటుచేశామన్నారు. విద్యార్థులు ప్రత్యక్షంగానూ, ఆన్ లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన వివిధ యూనివర్శిటీల వీసీలతో ప్రసాదరాజు

వృద్ధాశ్రమానికి మూడెకరాల కౌలు ఆదాయం దానం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

తాళ్ళరేవు రత్నవారి పేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రత్న రామారావు కోరంగి వృద్ధులు, అనాధ బాలల ఆశ్రమానికి మూడు ఎకరాల స్థల దానం చేశారు. ఈ సందర్భంగా రత్నవారిపేటలో రామారావు నిర్మించిన సత్య కామేశ్వరి కల్యాణ మండపం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. కాజులూరులో తనకు ఉన్న మూడు ఎకరాల చెరువులకు సంబంధించి వాటి నుంచి వచ్చే కౌలు ధనాన్ని ఆశ్రమంలోని విద్యార్థుల భోజన సదుపాయాలకు, విద్యకు ఖర్చు చేయాలని ఆశ్రమ నిర్వాహకులు సంగాడి రాంబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా సత్సంగ్‌లో శివ పార్వతులు, లక్ష్మీనారాయణలకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్నాధరావు (బాబీ) నరసింహ స్వామి, రాజు, కంబాలకష్ణ, పితాని శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగి రత్న రామారావు, ఆశ్రమ నిర్వాహకులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేశనకుర్రు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న జెడ్‌పి హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు హెచ్ఎం బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను వైస్ ఎంపిపి పిన్నమరాజు సత్యనారాయణరాజు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతిరాజు, పిన్నమరాజు పెదబాబు, మోకారవి కుమార్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ సుభాహన్ సాహెబ్, యలమంచిలి వాసు, పెమ్మాడి చిన్నా, చింతా రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గున్నారు.

సాధనతోనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి -మండపేట

సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని హైదరాబాద్ కి చెందిన ర్యాంక్ అకాడమీ ఆఫ్ కెమిస్ట్రీ విద్యాసంస్థకు చెందిన ప్రముఖ కాలమిస్ట్ ఎఎన్ఎస్.శంకర్రావు అన్నారు. తాపేశ్వరంలో పోలిశెట్టి సత్తిరాజు, భూషణం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కెమిస్ట్రీని ఎంత సులభంగా నేర్చుకోవాలో వివరించారు. పరీక్షల్లో భయంతో కాకుండా శ్రద్ధగా చదివి ఫలితాల పై కాకుండా ఆయా అంశాల పై దృష్టి సారించాలన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ ఉత్తమ ఆశయాలతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పలుస్ఫూర్తిదాయక అంశాలను, ఎన్ఐఐఇ, జెఇఇ, ఐటిఐ పరీక్షలు రాసే విధానంపై వారు మెళుకువలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గుణ్ణం వీరన్న, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.



వెంకన్నబాబును సత్కరిస్తున్న రాణి తదితరులు

సచివాలయాల కన్వీనర్‌కు సత్కారం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ సచివాలయాల కన్వీనర్‌గా నియమితులైన యరమాటి వెంకన్నబాబును మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం ఆమె పార్టీ కార్యాలయంలో సత్కరించారు. రాణి మాట్లాడుతూ అందరి సమన్వయంతో పార్టీకి మరిన్ని సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

చల్లపల్లి పంచాయితీ బొండాడిపేట ఎంపిపి పాఠశాలలో రూ.20 లక్షలతో చేయనున్న నాడు- నేడు అభివృద్ధి పనులకు బుధవారం సర్పంచ్ ఇసుక పట్ల జయమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు వరసాల వెంకటలక్ష్మి, పిఎంసి ఛైర్మన్ బీర నాగరాజు, గ్రామ పెద్దలు ఇసుకపట్ల రఘుబాబు, గుమ్మళ్ల వెంకటరమణ, మార్త సుబ్బారావు, కుంచే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసమే పథకాలు

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసమే పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. బుధవారం 2వ రోజు స్థానిక గ్రామీణ పరిధిలోని పాలగుమ్మి రేవులో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పేరిట ఇంటింటికి తిరిగి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పలువురు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పి.శ్రీహరి రాంగోపాల్, సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు పాలగుమ్మి విజయ, కె.చంద్రమోహన్, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తుల నిరసన

అంబాజీపేటతమ గ్రామంలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలని తమ గ్రామానికి రహదారి కూడా లేకుండా పోయిందని అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామస్తులు పి.గన్నవరం ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబును ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత వాటిని విస్మరించి ప్రజా ప్రతినిధుల వల్ల ఏ విధమైన ప్రయోజనం లేద ర్లీలకతీతంగా గ్రామస్తులు బుధవారం ఆయనను పాల్గొన్న గడప..గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. పసుపల్లి గ్రామంలో ప్రధానంగా రోడ్లు అధ్వానంగా ఉండటంతో అవస్థలు పడుతున్నమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ స్థానికులతో చర్చించారు.

ఎంఎల్‌ఎ ఈ విషయమై స్పందించి 'మే' నెలలో రోడ్లు ఆధునికీకరిస్తామని భరోసా కల్పించి గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగరాజు, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి లక్ష్మీపతి, ఎఎంసి ఛైర్మన్ నాగవరపు నాగరాజు, వాసంశెట్టి పెదబాబు, బండారు మల్లి,నాయకులు, పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాలగుమ్మిలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



రామచంద్రపురంలో జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి వేణు

సంచార పశు ఆరోగ్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంచార పశు ఆరోగ్యసేవల వాహనాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. పురపాలక సంఘం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ప్రజాప్రతినిధులు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అన్నారు. బుధవారం అంగరలో డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు . కార్యక్రమంలో ఆలమూరు సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ అనిత, మండల పశు వైద్యసిబ్బంది,1962 సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి -మండపేట

పట్టణంలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో జనార్ధన స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రథంగుడిలో విశేష పూజలు అందుకున్న జగన్నాథుడు రథంపై ఊరేగారు. తొలుత ఎమ్‌ఎల్‌సి తోట త్రిమూర్తులు, ఛైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణిలు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట

రామచంద్రుడి కాలువ పూడికతీత పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వరి పొలాలకు సాగునీరు అందడం లేదని,ం కాలువలకు నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గరాణి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కాలువను పరిశీలించిన తోట ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను కాలువ పూడికతత పనులు చేపట్టాలని ఆదేశించారు. పూడికతీత పనులు ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాపేశ్వరం ఇరిగేషన్ లాకుల నుంచి ప్రారంభమైన ఈ కాలువ సుమారు 6 కి.మీ పరిధిలో విస్తరించి ఉంది. ఈ కాలువ క్రింద గొల్లపుంతలో సుమారు 150 ఎకరాల వరి పొలం సాగవుతోంది. అయితే పట్టణ పరిధిలో రెండు కి.మీ మేర ఉన్న ఈ కాలువ ఆక్రమాణలతో పాటు చెత్తకు నిలయంగా మారుతుండడంతో తరచూ సాగునీరుకు ఆటంకం ఏర్పడుతోంది. శాశ్వత పరిష్కార మార్గంగా కాలువ పనులు పూడికతీత పనులు చేపట్టాలని చిన్న, సన్నకారు రైతులు కోరుతున్నారు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక ప్రధాన కాలువ ఒడ్డున కల్యాణ వెంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఎఎంసి ఛైర్‌పర్సన్ తమ్మన సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ చిర్ల

నేరాలు ఘోరాలు

బైక్ ప్రమాదంలో యువకుని సజీవ దహనం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామం వద్ద మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఎదురు ఎదురుగా వెళుతున్న రెండు మోటార్ సైకిల్ ఢీ కొట్టుకున్న ప్రమాదంలో బిక్కవోలు గ్రామం ఆర్ఎస్ పేటకు చెందిన మండవల్లి శేష సాయి గౌతం (19) సజీవ దహనమయి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటనపై మృతుని తండ్రి మండవెల్లి శ్రీనివాసరావు పోలీసులకు చేసిన ఫిర్యాదు వివరాలు ప్రకారం తన కుమారుడు సాయి గౌతమ్ మోటర్ సైకిల్ పై కాకినాడ వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరొక మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి నిర్లక్ష్యంగా దూసుకు వచ్చి బలంగా ఢీకొట్టడంతో పెట్రోల్ ట్యాంకు పగిలి మంటలు వ్యాపించి తన కుమారుడు అక్కడికక్కడే మతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమారుని మృతికి కారణమైన మోటార్ సైకిల్ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తండ్రి శ్రీనివాస రావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మండపేట

ద్వారపూడి పై ఓవర్ మెట్ల మీద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ బి.శివ కృష్ణ బుధవారం తెలిపారు. వివరాలు ఇవి.. మృతుని వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చునని అన్నారు. మృతుని ఎత్తు 5.5, చామన చాయ రంగు, తెలుపు రంగు చారలు కలిగిన చొక్కా, దానిపై చింతపిక్క రంగు స్వెటర్‌వేసుకుని, నలుపు రంగుపై ఎరుపుగీతాలు తెల్లని మచ్చలు ఆకుల డిజైన్లు లుంగీ కట్టుకుని ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ నెంబర్ 08855 232100, 94407 96537,94407 96592 నెంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రౌతులపూడిలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి శివాలయంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని బుధవారం వడలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన యాత్రికులు అన్నదాన స్వీకరించారు. సుమారు 6000 మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.